రాగం: బేహాగ్

తాళం: ఆది

నారాయణతే నమో నమో (భవ)
నారద సన్నుత నమో నమో

1. మురహర భవహర ముకుంద మాధవ
గరుడగమన పంకజనాభ
పరమపురుష భవబంధ విమోచన
నరమృగశరీర నమో నమో

2. జలధిశయన రవిచంద్రవిలోచన
జలరుహ భవనుత చరణయుగ
బలిబంధన గోపవధూ వల్లభ
నలినోదర తే నమో నమో

3. ఆదిదేవ సకలాగమ పూజిత
యాదవకుల మోహనరూప
వేదోద్ధర శ్రీవేంకటనాయక
నాదప్రియ తే నమో నమో